సేవకుడు

Written by Tarangini

సేవకుడు

Written by

Tarangini

ముందు మాట

మన జీవితాల్లో కొంతమంది మనుషులు చాలా సాధారణంగా కనిపిస్తారు.

ప్రతిరోజూ మన కళ్ల ముందే కనిపిస్తుంటారు.

వాళ్ల గురించి మనం పెద్దగా ఆలోచించం.

వాళ్ల పేర్లు గుర్తుపెట్టుకోం.

కానీ...

ఒకరోజు వెనక్కి తిరిగి చూసినప్పుడు, వాళ్లు చేసిన పని విలువ ఎంత గొప్పదో అర్థమవుతుంది.

ఈ కథ అలాంటి ఒక మనిషి గురించి.

కలలు కనడానికి ధైర్యం కావాలి.

ఆ కలల కోసం పోరాడడానికి పట్టుదల కావాలి.

పరాజయాల తర్వాత కూడా ముందుకు నడవడానికి విశ్వాసం కావాలి.

ఆ విశ్వాసం ఉన్న ప్రతి మనిషి కథ చెప్పదగ్గదే.

"సేవకుడు" అలాంటి ఒక ప్రయాణం.

ఈ కథలోని పాత్రలు, సంఘటనలు, భావోద్వేగాలు...

మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళ్తాయని ఆశిస్తున్నాను.

ఆ ప్రయాణంలో...

శివ మీకు పరిచయం అవుతాడు.

మిగతాదంతా...

ఈ పుస్తకం చెబుతుంది.

– తరంగిణి

విషయ సూచిక

1)ఉనికి

2)చివరి అవకాశం

3)కొత్త ప్రపంచం

4)ప్రత్యేక విధి

5)ఉగ్రదాడి

6)ఆరంభం

అధ్యాయం –l

ఉనికి

సేవకుడు

ఉదయం ఆరు గంటల సమయం.
ఊరు ఇంకా పూర్తిగా మేల్కోలేదు.

టీ దుకాణం ముందు ఉన్న చెక్క బెంచీల మీద కొందరు తమ చేతుల్లో వేడి వేడి టీ గ్లాసులు పట్టుకుని కూర్చున్నారు. మరికొందరు ప్రశాంతంగా ఉదయపు పేపర్లు తిరగేస్తున్నారు.

ఆ ప్రశాంతతని ఒక్క వార్త భంగం చేసింది.

"సరిహద్దు ప్రాంతంలో మిలిటరీ వాహనంపై ఉగ్రదాడి..."

ఆ హెడ్‌లైన్ కనిపించగానే రామచంద్రయ్య గారి చేతిలోని టీ గ్లాస్ స్వల్పంగా కంపించింది.ఆయన కళ్లద్దాలు సరిచేసుకుని వార్తను పూర్తిగా చదవడం ప్రారంభించారు.

"దాడి సమయంలో వాహనాన్ని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లేందుకు డ్రైవర్ చేసిన ప్రయత్నం వల్ల పలువురు సైనికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని అధికారులు తెలిపారు..."

అక్కడితో ఆయన చూపు ఆగిపోయింది.
ఆ వార్త పక్కనే ఒక ఫోటో ఉంది.
కాలిపోయిన మిలిటరీ వాహనం.
పొగ.
గందరగోళం.
ఆ ఫోటో కింద ఒక పేరు.

"శివ."

ఆ పేరు చదివిన క్షణం...
ఆయన గుండె ఒక్కసారిగా భారంగా మారింది.
కొన్ని క్షణాలు అక్కడే కూర్చున్నారు.
చుట్టూ ఉన్న వాళ్లు ఏం మాట్లాడుతున్నారో కూడా వినిపించలేదు.
ఆ పేరు మాత్రమే మళ్లీ మళ్లీ ఆయన మనసులో ప్రతిధ్వనించింది.
శివ.
టీ గ్లాస్ టేబుల్ మీద పెట్టి నెమ్మదిగా లేచారు.
ఏమీ మాట్లాడకుండా ఇంటి వైపు నడిచారు.

ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎదురుగా ఉన్న గోడ మీద ఒక ఫోటో కనిపించింది.
పాత ఫోటో.
చిరునవ్వుతో నిలబడి ఉన్న రామచంద్రయ్య.
ఆయన పక్కనే పదకొండు పన్నెండేళ్ల చిన్న అబ్బాయి.
కళ్లలో అమాయకత్వం.
ముఖంలో చిరునవ్వు.
అతనే...
శివ.
ఫోటో మీద పేరుకున్న దుమ్ముని మెల్లగా తుడిచారు.
ఆ తర్వాత కుర్చీలో కూర్చుని కళ్లను మూసుకున్నారు.
ఎప్పటినుంచో మూసి ఉంచిన తలుపులు తెరుచుకున్నట్టుగా,
జ్ఞాపకాలు ఒక్కొక్కటిగా తిరిగి రావడం ప్రారంభించాయి.

పదిహేనేళ్ల క్రితం...
వాన పడుతున్న రాత్రి.
హాస్టల్ భవనం పైకప్పు మీద చినుకులు టపటపమంటూ పడుతున్నాయి.
మిగతా పిల్లలంతా నిద్రలో ఉన్నారు.కానీ ఒక చిన్న అబ్బాయి మాత్రం కిటికీ దగ్గర నిలబడి బయటికి చూస్తున్నాడు.
అతడే శివ.
చిన్నప్పటి నుంచి శివకి "ఇల్లు" అంటే పెద్దగా గుర్తులేదు.పండుగలప్పుడు కొత్త బట్టలు కొని పెట్టే తల్లిదండ్రులు...సాయంత్రం స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికి తీసుకెళ్లే నాన్న...రాత్రి నిద్రపుచ్చే అమ్మ...
ఇవి అన్నీ అతనికి కథల్లో మాత్రమే ఉండేవి.
పేదరికం వాళ్ల తల్లిదండ్రుల్ని అతనికి దూరం చేసింది.
చిన్న వయసులోనే హాస్టల్ జీవితం అతని విధిగా మారిపోయింది.
మొదట్లో ప్రతి రాత్రి దుప్పటి కప్పుకుని ఏడ్చేవాడు.
కానీ రోజులు గడిచేకొద్దీ...
ఆ హాస్టల్‌నే తన ప్రపంచంగా అంగీకరించాల్సి వచ్చింది.
అక్కడే మొదటిసారి అతనికి నిజమైన స్నేహితులు దొరికారు.
అక్కడే మొదటిసారి అతనికి ఒక గురువు దొరికాడు.
అతనే
రామచంద్రయ్య.

ప్రతి శనివారం రాత్రి...హాస్టల్ పిల్లలందరినీ ఒకచోట కూర్చోబెట్టి కథలు చెప్పేవారు రామచంద్రయ్య.అవి కేవలం కథలు కావు.
దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన మనుషుల జీవితాలు.

యుద్ధరంగంలో పోరాడిన సైనికుల గురించి,మంచు పర్వతాల మధ్య నెలల తరబడి విధులు నిర్వహించిన జవాన్ల గురించి,తమ కుటుంబాలకు దూరంగా ఉండి, లక్షల కుటుంబాలు ప్రశాంతంగా నిద్రపోవడానికి కారణమైన మనుషుల గురించి.
ఆయన చెబుతుంటే,కొంతమంది పిల్లలు మధ్యలోనే నిద్రలోకి
జారిపోయేవారు.కానీ శివ మాత్రం,చివరి మాట వరకు శ్రద్ధగా
వింటుండేవాడు.
ఎందుకంటే...మిగతావాళ్లకు అవి కథలు.
శివకి మాత్రం అవి ఒక ప్రపంచం.
తనకు ఎప్పుడూ కనిపించని ఒక దారి.
తన జీవితానికి అర్థం చెప్పే ఒక పిలుపు.
ఒక రాత్రి...కథ పూర్తయ్యాక పిల్లలందరూ తమ గదుల వైపు వెళ్లిపోయారు.
కానీ శివ మాత్రం అక్కడే నిలబడ్డాడు.
కొన్ని క్షణాలు సంకోచించి,మెల్లగా అడిగాడు."సార్... నేను కూడా ఒకరోజు సైనికుడిని అవ్వొచ్చా?"
రామచంద్రయ్య అతని వైపు చూశారు.
ఆ ప్రశ్నలో ఒక చిన్నారి ఆశ కనిపించింది.ఒక కల కనిపించింది.ఆయన చిరునవ్వు నవ్వారు.
"ఎందుకు కాదు?"
"నిజంగానా సార్?"
"నిజంగానే."
ఆ రెండు మాటలు,రామచంద్రయ్యకు సాధారణ సమాధానం కావచ్చు.
కానీ శివకు మాత్రం,అవి తన భవిష్యత్తు తలుపులు తెరిచిన మాటలు.
ఆ రాత్రి,అతని మనసులో మొదటిసారి ఒక కల పుట్టింది.
దేశాన్ని కాపాడే వారిలో తాను కూడా ఒకడిగా నిలవాలనే కల.

ఆ రోజు నుంచి...
ప్రతి ఉదయం అతనికి కొత్త అర్థాన్ని ఇచ్చింది.
ఏ కష్టం అతన్ని భయపెట్టలేదు.
ఎందుకంటే...
ఇక అతను కేవలం బతకడం కోసం కాదు,
ఒక లక్ష్యం కోసం జీవించడం ప్రారంభించాడు.
సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ...
శివలోని కల పెద్దదవుతోంది.
కానీ అదే సమయంలో...
జీవితం కూడా తన పరీక్షలను కఠినంగా మారుస్తోంది.
ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత అతని స్నేహితులందరూ తమ తమ దారులు ఎంచుకున్నారు.
కొంతమంది డిగ్రీలో చేరారు.
మరికొందరు చిన్న చిన్న ఉద్యోగాలు వెతుక్కున్నారు.
ఇంకొందరు కుటుంబ బాధ్యతల్లో మునిగిపోయారు.
కానీ శివ మాత్రం ఒక్క దారినే చూస్తున్నాడు.

ఆర్మీ.

ఉదయం సూర్యుడు ఉదయించకముందే లేచి పరుగులు తీసేవాడు.
పాత షూస్.
చిరిగిపోయిన ట్రాక్ ప్యాంట్.
చేతిలో చవకైన వాటర్ బాటిల్.
అంతే అతని ప్రపంచం.
గ్రౌండ్ చుట్టూ తిరుగుతూ...
తన మనసులో మాత్రం ఒకే చిత్రం.
ఆలివ్ గ్రీన్ యూనిఫాం.

మొదటి ప్రయత్నం.
ఫిజికల్ టెస్ట్ క్లియర్ చేశాడు.
కానీ రాత పరీక్షలో విఫలమయ్యాడు.
ఫలితాలు చూసిన రోజు...
ఎవరికీ కనిపించకుండా గంటల తరబడి ఒంటరిగా కూర్చున్నాడు.
"పర్లేదు... ఇంకోసారి."
అని తనని తానే ఓదార్చుకున్నాడు.

రెండో ప్రయత్నం.
ఈసారి రాత పరీక్ష బాగానే రాశాడు.
కానీ తుది జాబితాలో పేరు రాలేదు.
ఆ రాత్రి...
నిద్ర పట్టలేదు.
పైకప్పు వైపు చూస్తూ తెల్లవార్చాడు.

మూడో ప్రయత్నం.
ప్రతి సారి...
ఆశ.
ప్రతి సారి...
నిరాశ.
కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే...
ప్రతి ఓటమి తర్వాత శివ మరింత బలంగా లేచేవాడు

ఒక రోజు.
మధ్యాహ్నం.
గ్రౌండ్ పక్కన ఉన్న చెట్టు కింద కూర్చుని ఉన్నాడు.
అప్పుడే ఫోన్ మోగింది.
స్క్రీన్ మీద పేరు కనిపించింది.

"రాము"

శివ చిన్నగా నవ్వుకున్నాడు.
కాల్ లిఫ్ట్ చేశాడు.
"హలో రా..."
అవతల నుంచి వెంటనే సమాధానం వచ్చింది.
“హాయ్ రా సోల్జర్”
శివ నవ్వాడు.
"నన్ను ఆటపట్టించడం ఇంకా ఆపలేదా రా?"
"ఆపమంటావా? నువ్వు జనరల్ అయ్యాక ఆపేస్తాను."
"అయ్యే సూచనలు కనబడట్లేదు."
కొన్ని క్షణాలు ఇద్దరూ నవ్వుకున్నారు
తర్వాత రాము గొంతు కాస్త మృదువైంది.

"శివ..."
"హ్మ్?"
"ఎంతకాలం ఇంకా ఇలా?"
"ఏమిటి?"
"ఈ ప్రయత్నాలు."
శివ సమాధానం చెప్పలేదు.
"అందరం ఉద్యోగాలు చేసుకుంటున్నాం. నువ్వూ ఏదైనా చూసుకోవచ్చు కదా."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

తర్వాత శివ మెల్లగా అన్నాడు

"రాము…

"చెప్పు."

"నువ్వు ఎప్పుడైనా ఒక కలని ప్రేమించావా?"

రాము ఆశ్చర్యపోయాడు.

"ఏంటి?"

"నాకు ఈ యూనిఫాం అంటే ఇష్టం కాదు రా…"

"ప్రేమ."

"అందుకే వదులుకోలేకపోతున్నా."

అవతల కొద్దిసేపు మౌనం.

తర్వాత రాము నవ్వాడు.

"సరే రా."

"ఒకరోజు నువ్వు గెలిస్తే…"

"ముందు సెల్యూట్ నేనే చేస్తా."

"గెలవకపోతే?"

"అప్పటికీ నీకే సెల్యూట్."

"ఎందుకు?"

"ఎందుకంటే… ఇంత మొండిగా కలని పట్టుకున్న మనిషిని నేను చూడలేదు."

ఫోన్ కట్ అయిన తర్వాత కూడా…

ఆ మాటలు చాలా సేపు శివ మనసులో మారుమోగుతూనే ఉన్నాయి.

ఇప్పుడు అతనికి తెలిసింది ఒక్కటే.
ముందున్న అవకాశం…
బహుశా చివరిదై ఉండొచ్చు.
ఈసారి కూడా విఫలమైతే…
ఆర్మీ కలకి తానే వీడ్కోలు చెప్పాల్సి రావచ్చు.
ఆ ఆలోచనే అతని గుండెను భారంగా మార్చింది.
కానీ…
ఇప్పటిలాగే.
ఈసారి కూడా అతను ప్రయత్నాన్ని ఆపలేదు

అధ్యాయం – 2
చివరి అవకాశం

ఉదయం నాలుగు గంటలు.అలారం మోగకముందే శివకి మెలకువ వచ్చింది.గదిలోని కిటికీ తెరిచి బయటికి చూశాడు.ఆకాశం ఇంకా చీకటిగానే ఉంది.చల్లని గాలి ముఖాన్ని తాకింది.కొన్ని క్షణాలు అలాగే నిలబడ్డాడు.
ఈ రోజు…
తన జీవితాన్ని నిర్ణయించే రోజు కావచ్చు.లేదా…
తన కలకి ముగింపు పలికే రోజు కావచ్చు.ఆ ఆలోచనతోనే గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది.

పరీక్ష కేంద్రం బయట వందల మంది అభ్యర్థులు.అందరి ముఖంలోనూ ఆత్మవిశ్వాసం.అందరి కళ్లల్లోనూ ఆశ.
శివ మాత్రం నిశ్శబ్దంగా నిలబడ్డాడు.ఈసారి తన దగ్గర కోల్పోవడానికి ఏమీ లేదు,గెలవాలి.
అంతే.

రోజులు గడిచాయి.
ఫలితాల కోసం ఎదురుచూపులు మొదలయ్యాయి.ప్రతి ఉదయం,ప్రతి సాయంత్రం,ఫోన్ చెక్ చేయడం,వెబ్‌సైట్ ఓపెన్ చేయడం,మళ్లీ మళ్లీ..
అదే పని.

ఫలితాలు విడుదలైన రోజు…
జాబితాలో తన పేరు కనిపించిన క్షణం శివ కొన్ని సెకన్లు అలాగే నిలిచిపోయాడు.

శివ కళ్లల్లో నీళ్లు నిండిపోయాయి.
ఆ రోజు సాయంత్రం...
అతను నేరుగా హాస్టల్‌కి వెళ్లాడు.ఎన్నో సంవత్సరాల తర్వాత కూడా...ఆ పాత భవనం అలాగే ఉంది.ఆ మైదానం అలాగే ఉంది.ఆ జెండా స్తంభం అలాగే ఉంది.మారనిది ఇంకోటి కూడా ఉంది.
రామచంద్రయ్య సార్.

ఆయన వరండాలో కూర్చుని పిల్లల హోంవర్క్ చూస్తున్నారు.శివని చూడగానే చిరునవ్వు నవ్వారు."ఏమయ్యా... ఈ రోజు ముఖంలో ఏదో ప్రత్యేకమైన వెలుగు కనిపిస్తోంది."
శివ మాట్లాడలేదు.
తన చేతిలో ఉన్న కవర్‌ను ఆయన చేతిలో పెట్టాడు.రామచంద్రయ్య నెమ్మదిగా తెరిచి చదవడం ప్రారంభించారు.కొన్ని క్షణాల తర్వాత...
ఆయన కళ్లద్దాల వెనక కళ్లలో తడి మెరిసింది.
"సాధించావు కదా..."అన్నారు.
అంతే.
శివ ఇక ఆగలేకపోయాడు.చిన్న పిల్లాడిలా ఆయన భుజంపై తల పెట్టి ఏడ్చేశాడు.
ఎన్నేళ్ల బాధ.
ఎన్నేళ్ల నిరాశ.
ఎన్నేళ్ల అవమానాలు.
అన్నీ ఆ కన్నీళ్లతో బయటికి వచ్చేశాయి.
రామచంద్రయ్య మెల్లగా అతని భుజంపై చేయి వేశారు.
"నేను చెప్పాను కదా..."
"ఓడిపోవడం తప్పు కాదు అని."

ఆ రాత్రి...
చాలా రోజుల తర్వాత శివ ప్రశాంతంగా నిద్రపోయాడు.
కానీ...
మరుసటి రోజు నియామక పత్రాన్ని పూర్తిగా చదివినప్పుడు.అతని ముఖంలో ఉన్న ఆనందం కాస్త తగ్గిపోయింది.
ఎందుకంటే...
అతనికి వచ్చిన పోస్టు సాధారణ సైనికుడిగా కాదు.మిలిటరీ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో డ్రైవర్‌గా.ఆ కాగితం మీద ఉన్న ఆ ఒక్క పదం...అతని మనసులో విచిత్రమైన నిశ్శబ్దాన్ని నింపింది.
"డ్రైవర్..."అని మెల్లగా చదివుకున్నాడు.
చిన్నప్పటి నుంచి తనని తాను ఊహించుకున్న ప్రతి కలలో...
తన చేతిలో తుపాకీ ఉండేది.సరిహద్దు ఉండేది.యుద్ధభూమి ఉండేది.
కానీ...
స్టీరింగ్ మాత్రం ఎప్పుడూ ఉండేది కాదు.ఆ రాత్రి చాలా సేపు ఒంటరిగా కూర్చున్నాడు.ఎవరితోనూ మాట్లాడలేదు.
తర్వాతి రోజు ఉదయం రామచంద్రయ్యను శివ మళ్లీ కలిశాడు.



भारत सरकार
GOVERNMENT OF INDIA
सैन्य परिवहन विभाग
MILITARY TRANSPORT DIVISION
नियुक्ति पत्र
प्रिय श्री शिवा,
हमें यह बताते हुए प्रसन्नता हो रही है कि आपको सैन्य परिवहन विभाग में ड्राइवर के पद पर नियुक्त किया जाता है।
आपकी नियुक्ति दिनांक .... से प्रभावी होगी।
आपको देश की सेवा हेतु हार्दिक शुभकामनाएें।
भवदीय,
अधिकारी
सैन्य परिवहन विभाग

ఎవరూ అతని బాధను గమనించలేదు.
కానీ...
రామచంద్రయ్య గమనించారు.
"ఏమైంది శివ?"
అని అడిగారు.
శివ చిన్నగా నవ్వాడు.
"ఏమీ లేదు సార్."
"నువ్వు అబద్ధం చెప్పడం ఇంకా నేర్చుకోలేదు."
ఆ మాట విన్న శివ తల దించుకున్నాడు.
కొద్దిసేపటి తర్వాత మెల్లగా అన్నాడు.
"నేను అనుకున్నది ఇది కాదు సార్."
రామచంద్రయ్య నిశ్శబ్దంగా విన్నారు.
"నేను సరిహద్దుల్లో నిలబడాలని అనుకున్నా."
"దేశం కోసం పోరాడాలని అనుకున్నా."
"కానీ ఇప్పుడు..."
మాట మధ్యలోనే ఆగిపోయింది
కొన్ని క్షణాలు మౌనం.
తర్వాత రామచంద్రయ్య చిరునవ్వు నవ్వారు.
"ఒక ప్రశ్న అడగనా?"
"అడగండి సార్."
"సరిహద్దులో ఉన్న సైనికుడికి ఆహారం ఎవరు చేరుస్తారు?"
శివ ఆశ్చర్యంగా చూశాడు.
"తెలియదు."

"గాయపడిన సైనికుడిని ఆసుపత్రికి ఎవరు తీసుకెళ్తారు?"
శివ మౌనంగా ఉన్నాడు.
"వర్షంలో... మంచులో... యుద్ధ పరిస్థితుల్లో... వందల కిలోమీటర్లు ప్రయాణించి సైనికులను గమ్యానికి చేర్చేది ఎవరు?"
శివ సమాధానం చెప్పలేదు.
రామచంద్రయ్య మెల్లగా అన్నారు
"ప్రతి సైనికుడి చేతిలో తుపాకీ ఉండదు శివ."
"కొందరి చేతుల్లో స్టీరింగ్ ఉంటుంది."
"కానీ... యుద్ధ సమయాల్లో రెండూ ప్రాణాలనే మోస్తాయి."
ఆ మాటలు విన్న తర్వాత..
శివ చాలా సేపు ఏమీ మాట్లాడలేదు.
చివరకు...అతని పెదవులపై చిన్న చిరునవ్వు కనిపించింది.
అదే క్షణం...
తన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.
అలా...
ఎన్నో ఏళ్లుగా యూనిఫాం కోసం ఎదురుచూసిన శివ...
చివరకు దేశసేవ వైపు తన మొదటి అడుగు వేశాడు.

అధ్యాయం –3
కొత్త ప్రపంచం

మిలిటరీ శిబిరంలో శివకి మొదటి రోజు.
ఉదయం సూర్యుడు ఇంకా పూర్తిగా ఉదయించలేదు.
భారీ ఇనుప గేటు ముందు నిలబడి ఉన్నాడు శివ.
గేటు పైన ఉన్న జాతీయ చిహ్నం వైపు కొన్ని క్షణాలు చూసాడు.
చిన్నప్పటి నుంచి కలల్లో చూసిన ప్రపంచం..ఇప్పుడు తన కళ్ల ముందు ఉంది.
గుండె వేగంగా కొట్టుకుంటోంది.
ఆనందమో,ఉత్సాహమో లేదా భయమో...
తనకే అర్థం కాలేదు.
లోపల అడుగు పెట్టే ముందు ఒక్కసారి కళ్లను మూసుకున్నాడు.
రామచంద్రయ్య సార్ గుర్తొచ్చారు.
"నువ్వు ఖచ్చితంగా సాధిస్తావు శివ."ఆ మాటలు చెవుల్లో మారుమోగాయి.
లోతుగా ఊపిరి పీల్చుకుని గేటు దాటాడు.
మొదటి కొన్ని రోజులు కొత్తగా అనిపించాయి
ప్రతిదీ క్రమశిక్షణ.ప్రతిదీ నియమాల ప్రకారం.
శివకి ఇవన్నీ నచ్చాయి.
ఎందుకంటే...
తాను చేరింది ఉద్యోగంలో కాదు.తాను ప్రేమించిన ప్రపంచంలో.

డ్రైవర్‌గా శిక్షణ ప్రారంభమైంది.
మొదట్లో పెద్ద పెద్ద మిలిటరీ వాహనాలు చూసి ఆశ్చర్యపోయాడు.
సాధారణ బస్సుల్లా కనిపించినా...
వాటి బాధ్యత మాత్రం అసాధారణం.
కొన్నిసార్లు సైనికులను తరలించాలి.
కొన్నిసార్లు సామాగ్రి.
కొన్నిసార్లు మందుగుండు సామాను.

DISCIPLINE
DUTY
HONOUR
NATION

ప్రతి ప్రయాణం వెనుక ఒక బాధ్యత ఉంటుంది.
అది శివకి నెమ్మదిగా అర్థమవుతోంది.
ఒక రోజు మధ్యాహ్నం.
గ్యారేజ్ దగ్గర వాహనాన్ని శుభ్రం చేస్తున్నాడు.
అప్పుడే వెనుక నుంచి ఒక స్వరం వినిపించింది.
"కొత్తోడివా?"
వెనక్కి తిరిగి చూశాడు.
దాదాపు తన వయసులోనే ఉన్న ఒక సైనికుడు.
ముఖంలో చిరునవ్వు.
"అవును."
"పేరు?"
"శివ.“
"నేను అర్జున్."
అని చేయి చాపాడు.
శివ కూడా చేయి కలిపాడు.
అదే వాళ్ల స్నేహానికి ప్రారంభం.
కొద్ది రోజులకే శివకి చాలామంది పరిచయం అయ్యారు.
అర్జున్,ఫరూక్,రఘు,విక్రమ్.
ప్రతి ఒక్కరికీ ఒక కథ ఉంది.
ప్రతి ఒక్కరికీ ఇంట్లో ఎదురు చూస్తున్న వాళ్లు ఉన్నారు.
ఒకరికి పెళ్లి నిశ్చయమైంది.
ఒకరికి కొత్తగా బిడ్డ పుట్టింది.
ఒకరి అమ్మ ఆరోగ్యం బాగోలేదు.
కానీ...
యూనిఫాం వేసుకున్న తర్వాత అందరి వ్యక్తిగత బాధలు ఒక మూలకు వెళ్లిపోయేవి.
ముందు ఉండేది ఒక్క బాధ్యత మాత్రమే

ఒక రాత్రి,డ్యూటీ ముగిసిన తర్వాత అందరూ కలిసి కూర్చున్నారు.
టీ గ్లాసులు చేతిలో.
చుట్టూ నవ్వులు.
జోకులు.
అర్జున్ అకస్మాత్తుగా అడిగాడు.
"శివ... నువ్వు డ్రైవర్ పోస్టు రావడంతో నిరాశపడ్డావట కదా?"
శివ ఆశ్చర్యపోయాడు.
"నీకు ఎవరు చెప్పారు?"
"మొత్తం క్యాంప్‌కి తెలుసు."అందరూ నవ్వేశారు.
శివ కూడా నవ్వాడు.
"కొంచెం బాధేసింది."
"ఇప్పుడు?"అని ఫరూక్ అడిగాడు.
శివ కాసేపు ఆలోచించాడు.తర్వాత మెల్లగా అన్నాడు.
"ఇప్పుడు అర్థమైంది."
"ఏమిటి?"
"నేను వాహనం నడపడం లేదు."అందరూ ఆశ్చర్యంగా చూశారు.
"అయితే?"
శివ టీ గ్లాస్ టేబుల్ మీద పెట్టాడు.
"దేశాన్ని కాపాడే మనుషుల్ని గమ్యానికి చేరుస్తున్నా."
కొన్ని క్షణాలు ఎవరూ మాట్లాడలేదు.
తర్వాత అర్జున్ నవ్వుతూ అన్నాడు.
"అయ్యో... మన డ్రైవర్ గారు ఫిలాసఫర్ కూడా అనుకుంటా."
మళ్లీ నవ్వులు.
మళ్లీ సరదా.

రోజులు గడిచాయి.

నెలలు గడిచాయి.

శివ జీవితం ప్రశాంతంగా సాగుతోంది.

తాను ఇష్టపడే పని.

తాను గౌరవించే మనుషులు.

తాను ప్రేమించే దేశం.

అన్నీ సరిగ్గానే ఉన్నాయి.

కానీ...

జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో...

ఎవరికీ తెలియదు.

అధ్యాయం –4
ప్రత్యేక విధి

"శివ!"
గ్యారేజ్ దగ్గర వాహనం తనిఖీ చేస్తూ ఉన్న శివ వైపు ఒక అధికారి నడుచుకుంటూ వచ్చాడు.
"సర్!"అని వెంటనే సెల్యూట్ చేశాడు.
"రేపు ఉదయం బయలుదేరాలి."
"ఎక్కడికి సర్?"
"సరిహద్దు ప్రాంతం."
ఆ మాట విన్న క్షణం...
శివ గుండె ఒక్కసారిగా వేగంగా కొట్టుకుంది.
సరిహద్దు.
చిన్నప్పటి నుంచి వింటూ వచ్చిన పదం.
కథల్లో విన్నాడు.
కలల్లో చూశాడు.
కానీ ఇప్పుడు...
తాను అక్కడికి వెళ్తున్నాడు.
"యెస్ సర్."
అని గట్టిగా సమాధానం చెప్పాడు.
ఆ రాత్రి శివకి నిద్ర పట్టలేదు.
ఎన్నో ఆలోచనలు.
ఎన్నో జ్ఞాపకాలు.
హాస్టల్.
రామచంద్రయ్య సార్.
ఆర్మీ కల.
పరాజయాలు.
అన్నీ కళ్లముందు తిరిగాయి.

మరుసటి రోజు ఉదయం.
సైనికులు ఒక్కొక్కరుగా బస్సులో ఎక్కుతున్నారు.
అర్జున్,ఫరూక్,రఘు.ఇంకా చాలామంది.
బస్సు మొత్తం సరదా మాటలతో సందడిగా మారిపోయింది.
"ఏయ్ శివ!"అని అర్జున్ అరిచాడు.
"ఈరోజు డ్రైవింగ్ బాగా చేయాలి."
"ఎందుకు?"
"నా పెళ్లి వచ్చే నెల."
"నువ్వు నన్ను క్షేమంగా తీసుకెళ్లాలి."
బస్సులో నవ్వులు.
ఫరూక్ వెంటనే అన్నాడు.
"నా పాప స్కూల్‌కి వెళ్లే వరకు నేను బతకాలి."
అని తన మొబైల్‌లో ఉన్న చిన్న పాప ఫోటో చూపించాడు.
"చూడు శివ."
"నిన్ననే పంపింది."
శివ ఫోటో చూసి నవ్వుకున్నాడు
"చాలా క్యూట్‌గా ఉంది."
ఫరూక్ కళ్లల్లో గర్వం మెరిసింది.
"నా ప్రపంచం."అన్నాడు
వెనుక సీటులో కూర్చున్న రఘు నవ్వుతూ అన్నాడు.
"మీ ఇద్దరికీ కుటుంబాలున్నాయి."
"నాకైతే ఇంటికి వెళ్లి అమ్మ చేసిన పప్పుచారు తినడమే కల."
మళ్లీ నవ్వులు.

బస్సు ముందుకు సాగుతోంది.
కిటికీల బయట ప్రకృతి మారుతోంది.ఊర్లు మాయమవుతున్నాయి.
రోడ్లు ఖాళీ అవుతున్నాయి.కొండలు కనిపించడం ప్రారంభించాయి.
శివ స్టీరింగ్ పట్టుకుని నిశ్శబ్దంగా డ్రైవ్ చేస్తున్నాడు.
వెనుక వినిపిస్తున్న నవ్వులు వింటూ...
తన పెదవుల మీద కూడా చిరునవ్వు వచ్చింది.
ఎందుకో...
ఈ ప్రయాణం తనకి ప్రత్యేకంగా అనిపించింది.
బస్సు కాసేపు పక్కకి ఆపారు.అర్జున్ అకస్మాత్తుగా శివ పక్కన వచ్చి నిలబడ్డాడు.
"ఒకటి అడగనా?"
"అడుగు."
"ఇన్ని సంవత్సరాలు ఓడిపోయాక కూడా ఎలా వదల్లేదు?"
"తెలియదు."
"ఏదో ఒకరోజు సాధిస్తాననే నమ్మకం."
"లేకపోతే?"
"అయినా ప్రయత్నించాననే సంతృప్తి."
అర్జున్ కొద్దిసేపు మౌనంగా ఉన్నాడు.
"అందుకే అందరూ నిన్ను ఇష్టపడతారేమో."అన్నాడు.

బస్సు మళ్లీ ప్రయాణం ప్రారంభించింది.
ఆకాశం మెల్లగా మబ్బులతో నిండుతోంది.
గాలి వేగం పెరుగుతోంది.
దూరంగా కొండల మధ్య రహదారి సాగుతోంది.
శివ స్టీరింగ్ మీద గట్టిగా పట్టు బిగించాడు.
ఏదో తెలియని భావన అతని మనసులో మెదిలింది.
కానీ వెంటనే దాన్ని పట్టించుకోలేదు.
వెనుక నుంచి మళ్లీ నవ్వులు వినిపించాయి.
ఫరూక్ తన పాప గురించి చెబుతున్నాడు.
అర్జున్ తన పెళ్లి గురించి కలలు కంటున్నాడు.
రఘు ఇంటికి వెళ్లాక తినబోయే వంటకాల జాబితా చెబుతున్నాడు.
వాళ్లందరినీ చూస్తూ...
శివ మనసులో ఒకే ఆలోచన వచ్చింది.
"వీళ్లందరూ క్షేమంగా చేరాలి."
అంతే.
అతనికి తెలియదు...
కొన్ని గంటల తర్వాత...
తన జీవితంలోనే అతిపెద్ద పరీక్ష ఎదురుచూస్తోందని.

అధ్యాయం –5

ఉగ్రదాడి

బస్సు కొండల మధ్యగా ముందుకు సాగుతోంది.
రోడ్డు దాదాపు ఖాళీగా ఉంది.
వెనుక సీట్లలో ఎప్పటిలాగే మాటలు, నవ్వులు.
అర్జున్ కిటికీ బయట చూస్తూ కూర్చున్నాడు.
ఫరూక్ తన మొబైల్‌లో పాప ఫోటోలు చూస్తున్నాడు.
రఘు మాత్రం సీటుకి ఆనుకుని కునుకు తీస్తున్నాడు.
అన్నీ సాధారణంగానే ఉన్నాయి.

శివ దృష్టి మొత్తం రోడ్డుపైనే ఉంది.
అప్పుడే...
దూరంగా ఒక వింత కదలిక కనిపించింది.
రోడ్డుకి కాస్త దూరంగా ఉన్న పొదల మధ్య ఏదో మెరుపు.
ఒక్క క్షణం.
అంతే.
శివ కనుబొమ్మలు ముడిచాడు.
మళ్లీ చూసేలోపే...
అది కనిపించలేదు.
“బహుశా సూర్యకాంతి అయి ఉంటుంది."అనుకున్నాడు.
కానీ...మనసులో ఏదో తెలియని అసౌకర్యం మొదలైంది.
బస్సు ఇంకొన్ని మీటర్లు ముందుకు వెళ్లింది.

అప్పుడే..
ధామ్..! అని శబ్దం .
భూమంతా కంపించినట్టైంది.
భారీ పేలుడు శబ్దంతో బస్సు ఒక్కసారిగా గాల్లోకి లేచినట్టైంది.
వెనుక కూర్చున్న సైనికులు సీట్ల నుంచి ఎగిరిపడ్డారు.

అద్దాలు పగిలిపోయాయి.
పొగ.
దుమ్ము.
అరుపులు.
కొన్ని క్షణాలు ఎవరికీ ఏం జరిగిందో అర్థం కాలేదు.
"అందరూ కిందికి వంగండి!"అని ఒక సైనికుడు గట్టిగా అరిచాడు.
అంతలోనే కాల్పుల శబ్దం వినిపించింది.
టట్... టట్... టట్...బుల్లెట్లు బస్సు బాడీని తాకుతున్నాయి.
అప్పుడు ..
అది ప్రమాదం కాదని.
ఉగ్రదాడి అని.
అందరికీ అర్థమైంది.
శివ వెంటనే స్టీరింగ్‌ని గట్టిగా పట్టుకున్నాడు.
ముందు గాజు పగిలిపోయింది.
చేతికి అద్దపు ముక్కలు గుచ్చుకున్నాయి.
రక్తం కారుతోంది.
కానీ అతను పట్టించుకోలేదు.
అతని దృష్టి ఒక్కటే.
ఈ ప్రాంతం నుంచి బస్సుని బయటకు తీసుకెళ్లాలి.

మరో పేలుడు.
ఈసారి మరింత దగ్గరగా.
బస్సు ఒకవైపు బలంగా ఒరిగిపోయింది.
ఫరూక్ సీటు నుంచి కిందపడిపోయాడు.
రఘు తలకు బలంగా దెబ్బ తగిలింది.
మరికొందరు గాయపడ్డారు.
అర్జున్ లేచి నిలబడేందుకు ప్రయత్నించాడు.
"శివ!"
అని అరిచాడు.
"ఆపకు... ముందుకెళ్లు!"
శివ తల ఊపాడు.
అంతే.
మళ్లీ రోడ్డుపైనే దృష్టి పెట్టాడు.
కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి.
బస్సు బాడీ మీద బుల్లెట్ల ముద్రలు పడుతున్నాయి.
ఒక బుల్లెట్ డ్రైవర్ కేబిన్ లోపలికి దూసుకొచ్చింది.
శివ భుజంలో తగిలింది.
అతని శరీరం ఒక్కసారిగా వణికింది.
స్టీరింగ్ మీద పట్టు కాస్త సడలింది.
కానీ...
మరుసటి క్షణమే మళ్లీ బిగించాడు.
వెనుక ఉన్న వాళ్లకి అది తెలియలేదు.
తెలిసినా..
ఏమీ చేయలేరు.
ఎందుకంటే ఆ క్షణంలో వాళ్లందరి ప్రాణాలు ఆ స్టీరింగ్ పట్టుకున్న చేతుల మీదే ఉన్నాయి.

కొన్ని నిమిషాలు...
గంటల్లా అనిపించాయి.
చివరికి..దూరంగా సురక్షిత ప్రాంతం కనిపించింది.
శివ ఊపిరి పీల్చుకున్నాడు.
బస్సు వేగం తగ్గించాడు.
ప్రమాద ప్రాంతం దాటిపోయింది.
సైనికులు వెంటనే గాయపడిన వాళ్లని కిందికి దింపడం ప్రారంభించారు.
ఒక్కొక్కరిని బయటకు తీసుకెళ్తున్నారు.
అర్జున్,రఘు,మరికొందరు.
అందరూ సురక్షితంగా బయటకు వచ్చారు.
అర్జున్ బస్సు దిగాడు.
దిగిన తర్వాత,అతనికి ఏదో గుర్తొచ్చింది.
అతను వెంటనే వెనక్కి తిరిగి చూశాడు.
ఫరూక్ కనిపించట్లేదు.
శివ గుండె ఒక్కసారిగా ఆగిపోయినట్టైంది.
ఆ క్షణంలో చుట్టూ వినిపిస్తున్న కాల్పుల శబ్దాలు...
పేలుళ్లు...
అరుపులు...
అన్నీ మసకబారిపోయాయి.
అతని మనసులో మాత్రం ఒకే పేరు మారుమోగుతోంది.
ఫరూక్.
తనతో ఎన్నో కష్టాలు పంచుకున్న స్నేహితుడు.
యుద్ధభూమిలో తన వెన్నంటే నిలిచిన మనిషి.
అంతకంటే ముఖ్యంగా...

ప్రతి సారి సెలవుల నుంచి తిరిగి వచ్చినప్పుడు
తన కూతురు ఫోటో చూపిస్తూ,"నా పాపకి సైకిల్ కొనాలి..."
అంటూ ఆనందంగా చెప్పే తండ్రి.
ఆ చిన్నారి ఇప్పుడు...
ఎక్కడో దూరంగా తన నాన్న కోసం ఎదురుచూస్తూ ఉంటుంది.
ఆ ఆలోచనే శివ గుండెను కలిచివేసింది.
ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు.
వెంటనే వెనక్కి తిరిగి నడవడం ప్రారంభించాడు.
"శివ...!"
అర్జున్ అతన్ని ఆపాడు.
"అక్కడ ఇంకా ఉగ్రవాదులు ఉండొచ్చు."
శివ ఆగలేదు.
"నాకు తెలుసు."
"అయితే ఎందుకు వెళ్తున్నావు?"
కొన్ని క్షణాలు మౌనం,తర్వాత శివ నెమ్మదిగా అన్నాడు.
"మనందరం బతికి ఇక్కడ నిలబడి ఉండటానికి కారణం వాడూ ఒకడు,ఇప్పుడు వాడిని అక్కడ వదిలేసి రాలేను."
అర్జున్ ఏమీ మాట్లాడలేకపోయాడు.
"అర్జున్..,నేను తిరిగి రాకపోతే..."
ఆ మాట పూర్తి చేయలేదు.
చిరునవ్వు నవ్వాడు.
"ఫరూక్ పాపకి తన నాన్న హీరో అని చెప్పు."
అని చెప్పి ముందుకు నడిచిపోయాడు.
అర్జున్ అక్కడే నిలబడి చూస్తున్నాడు.
ఒక సైనికుడు ప్రమాదం వైపు నడిచి వెళ్లడం కాదు అది.
ఒక స్నేహితుడు...
మరో స్నేహితుడి కోసం ప్రాణాలను పణంగా పెట్టి వెళ్లడం.

దూరంగా...
రోడ్డు పక్కన ఫరూక్ పడివున్నాడు.
గాయాలతో స్పృహ కోల్పోయి ఉన్నాడు.
శివ అతని దగ్గరికి పరుగెత్తాడు.
"ఫరూక్...!"
అతని భుజాలు పట్టుకుని కుదిపాడు.
ఫరూక్ మెల్లగా కళ్లుతెరిచాడు.
"శివ..."
అతని పెదవులపై బలహీనమైన చిరునవ్వు మెరిసింది.
"నువ్వెందుకు వచ్చావురా..."
అన్నాడు.
శివ సమాధానం చెప్పేలోపే...
చుట్టూ అడుగుల శబ్దాలు వినిపించాయి.
ఇద్దరూ ఒకేసారి ఆ వైపు చూశారు.
చీకట్లో నుంచి ఆయుధాలతో కొందరు ఉగ్రవాదులు బయటకు వస్తున్నారు.
ఆ క్షణంలో...
శివకి ఒక విషయం అర్థమైంది.
ఇక్కడి నుంచి బయటపడటం చాలా కష్టం.
కానీ...
ఫరూక్‌ని వదిలేయడం అంతకంటే కష్టం.
శివ వెంటనే ఫరూక్‌ని లేపడానికి ప్రయత్నించాడు.
"లే... మనం వెళ్లాలి."
ఫరూక్ నొప్పితో మూలిగాడు.
అతని కాలికి తీవ్ర గాయం అయింది.
లేచి నిలబడటానికే శక్తి లేదు.
ఇంతలో ఉగ్రవాదులు వాళ్లని గమనించారు.
కాల్పులు మొదలయ్యాయి.

శివ ఫరూక్‌ని రోడ్డు పక్కన ఉన్న పెద్ద రాయివెనక్కి తీసుకెళ్లాడు.
బుల్లెట్లు వాళ్ల చుట్టూ దూసుకెళ్తున్నాయి.
"శివ..."
ఫరూక్ మెల్లగా పిలిచాడు.
"నన్ను వదిలేసి వెళ్ళిపో."
శివ వెంటనే తల అడ్డంగా ఊపాడు.
"నోరు మూసుకుని ఉండు."
"ఇద్దరం కలిసి వెళ్తాం."
ఫరూక్ బలహీనంగా నవ్వాడు.
"నువ్వు ఎప్పుడూ ఇంతే."
మరోసారి కాల్పుల శబ్దం వినిపించింది.
శివ కూడా ఎదురుకాల్పులు ప్రారంభించాడు.
కొన్ని క్షణాలు...
ఆ ప్రాంతమంతా తుపాకుల శబ్దాలతో మారుమోగిపోయింది.
కానీ వాళ్ల పరిస్థితి బాగోలేదు.
శత్రువులు ఎక్కువ మంది ఉన్నారు.
మందుగుండు సామగ్రి కూడా తగ్గిపోతోంది.
ఫరూక్ ఆ విషయం గమనించాడు.
కొద్దిసేపు నిశ్శబ్దంగా శివ వైపు చూశాడు.
తర్వాత జేబులో నుంచి ఒక చిన్న ఫోటో బయటకు తీశాడు.
తన కూతురి ఫోటో.
ఆ ఫోటోని శివ చేతిలో పెట్టాడు.
"దీన్ని ఉంచు."
శివ గుండె బరువెక్కింది.
"ఏంట్రా ఇవన్నీ?"
"ఏమీ కాదు..."
అన్నాడు ఫరూక్.

కానీ అతని కళ్లలో మాత్రం అన్నీ కనిపిస్తున్నాయి.
తన కూతుర్ని ఇంకోసారి చూడలేనేమో అన్న ఆవేదన.
"శివ..."
"ఒకవేళ..."
ఫరూక్ గొంతు ఆగిపోయింది.
కొన్ని క్షణాలు కళ్లుమూసుకున్నాడు.
"ఒకవేళ నేను వెళ్లిపోతే..."
"నా పాపకి నేను చివరి వరకు తన గురించే ఆలోచించానని చెప్పు."
శివ కళ్లలో నీళ్లు తిరిగాయి.
"నువ్వే చెప్పాలి."
"మనిద్దరం ఇక్కడి నుంచి బయటపడతాం."
ఫరూక్ సమాధానం చెప్పలేదు.
కేవలం నవ్వాడు.
అప్పుడే...
ఒక బుల్లెట్ దూసుకొచ్చి ఫరూక్ ఛాతిని తాకింది.
అతని శరీరం ఒక్కసారిగా కుదిపేసింది.
"ఫరూక్!"
శివ అరుస్తూ అతన్ని పట్టుకున్నాడు.
ఫరూక్ పెదవులు స్వల్పంగా కదిలాయి.
అతని చూపు ఎక్కడికో దూరంగా వెళ్లిపోయింది.
బహుశా...
తన కూతురి దగ్గరకు.
నెమ్మదిగా అతని చేతులు జారిపోయాయి.
ఫోటో మీద ఉన్న చిన్నారి చిరునవ్వు మాత్రం అలాగే ఉంది.
"ఫరూక్..."
శివ గొంతు వణికింది.
కానీ సమాధానం రాలేదు.
ఆ యుద్ధభూమిలో...
ఒక సైనికుడు నిశ్శబ్దంగా తన చివరి సెల్యూట్ చేసి వెళ్లిపోయాడు.

తన స్నేహితుడి నిశ్శబ్దం.
శివ కొన్ని క్షణాలు అలాగే కూర్చున్నాడు.
ఫరూక్ ముఖం వైపు చూస్తూ...
అతను ఇంకా కళ్లుతెరిచి ఏదో మాట్లాడతాడేమో అన్నట్టుగా.
కానీ...
యుద్ధభూమిలో కొన్ని నిజాలు చాలా త్వరగా అంగీకరించాల్సి వస్తుంది.
ఫరూక్ ఇక లేడు.
మళ్లీ కాల్పుల శబ్దం వినిపించింది.
ఒక బుల్లెట్ వచ్చి బండను తాకింది.
రాయి ముక్కలు ఎగిరి పడ్డాయి.
శివ నెమ్మదిగా ఫరూక్ కళ్ళు మూసాడు.
ఒక్క క్షణం అతని భుజం మీద చేయి ఉంచాడు.
"పదరా..."
అని మెల్లగా అన్నాడు.
సమాధానం రాదని తెలిసినా.
ఆ తర్వాత లేచి నిలబడ్డాడు.
అప్పటికే ఉగ్రవాదులు చుట్టుముట్టారు
కొన్ని క్షణాలు ఊపిరి పీల్చుకోవడానికి ప్రయత్నించాడు.
గొంతులో చిరునవ్వు.
కళ్లలో అలసట.
ఆకాశం వైపు చూశాడు.
హాస్టల్ మైదానం గుర్తొచ్చింది.
రామచంద్రయ్య గుర్తొచ్చారు.
"సార్... నేను కూడా ఒకరోజు సైనికుడిని అవ్వొచ్చా?"
అని అడిగిన చిన్న శివ గుర్తొచ్చాడు.
"ఎందుకు కాదు?"
అని చెప్పిన ఆ స్వరం మళ్లీ చెవుల్లో వినిపించింది.
శివ పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసింది.
తాను అనుకున్న చోటుకు చేరుకోలేకపోయాడు.
కానీ...
తాను అనుకున్న మనిషిగా మాత్రం మారగలిగాడు.

అధ్యాయం –6

ఆరంభం

మరుసటి రోజు...
శివ స్మారక సభ కోసం ఆ రోజు హాస్టల్ ఆవరణ మొత్తం పిల్లలతో నిండిపోయింది.
మధ్యలో ఒక టేబుల్.
దానిపై శివ ఫోటో.
ఫోటోకి పూలమాల.
పక్కనే జాతీయ పతాకం.
ఆవరణంతా నిశ్శబ్దంగా ఉంది.
ఎప్పుడూ అల్లరి చేసే పిల్లలు కూడా ఆ రోజు మౌనంగా కూర్చున్నారు.
వేదికపై నిలబడ్డ రామచంద్రయ్య గారు కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు.
ఆయన చూపు మాత్రం శివ ఫోటో మీదే ఉంది.
ఆ ఫోటోలో ఇప్పటికీ అదే చిరునవ్వు.
ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం హాస్టల్ కిటికీ దగ్గర నిలబడి ఆకాశం వైపు చూసిన చిన్న అబ్బాయి గుర్తొచ్చాడు.
"సార్... నేను కూడా ఒకరోజు సైనికుడిని అవ్వొచ్చా?"
అని అడిగిన ఆ స్వరం ఇప్పటికీ ఆయన చెవుల్లో మారుమోగుతోంది.
రామచంద్రయ్య గారు మైక్ దగ్గరకు వెళ్లారు.
"శివ గురించి మీ అందరికీ ఇప్పుడు తెలుసు."
అన్నారు.
"కానీ నాకు తెలిసిన శివ..."
ఆయన గొంతు కాస్త భారమైంది.
"ఒకప్పుడు మీలాగే ఈ వరుసల్లో కూర్చునే చిన్న అబ్బాయి."
పిల్లలందరి చూపు ఫోటో మీద పడింది.
"వాడికి కూడా మీలాగే భయాలు ఉండేవి."
"వాడూ ఓడిపోయాడు."
"ఏడ్చాడు."
"నిరాశపడ్డాడు."
"కానీ ఒక విషయం మాత్రం ఎప్పుడూ వదల్లేదు."
కొన్ని క్షణాలు ఆగారు.
"తన కల."

ఆవరణ అంతా నిశ్శబ్దంగా మారిపోయింది.
"ఎన్నిసార్లు ఓడినా..."
"మళ్లీ లేచాడు."
"ఎంత కష్టమైనా..."
"ముందుకు నడిచాడు."
"చివరికి..."
రామచంద్రయ్య గారి చూపు శివ ఫోటో మీద పడింది.
"తన ప్రాణం కంటే ఇతరుల ప్రాణాలకు విలువ ఇచ్చే మనిషిగా ఎదిగాడు."
ఆయన గొంతు వణికింది.
"ఒక గురువుకి అంతకంటే పెద్ద గర్వం ఉండదు."
ఎవ్వరూ మాట్లాడలేదు.
గాలికి జాతీయ పతాకం మెల్లగా రెపరెపలాడుతోంది.
అప్పుడే...
చివరి వరుసలో కూర్చున్న ఒక అబ్బాయి మెల్లగా లేచి నిలబడ్డాడు.
రామచంద్రయ్య గారు అతని వైపు చూశారు.
కొన్ని క్షణాలు ఆగాడు.
శివ ఫోటో వైపు చూశాడు.
"నేను కూడా శివ అన్నయ్యలాగే సైనికుడిని అవుతాను సార్."
రామచంద్రయ్య గారి కళ్లలో నీళ్లు తిరిగాయి.
ఒక శివని కోల్పోయిన బాధ గుండెల్ని బరువెక్కిస్తుంటే... అదే వరుసలో ఇంకో శివ పుడుతున్నాడన్న ఆనందం ఆయన పెదవులపై చిరునవ్వుగా మెరిసింది.

శివ కథ అక్కడితో ముగియలేదు.
అది...
మరో హృదయంలో అప్పుడే మొదలైంది.

ముగింపు

ప్రతి యూనిఫాం వెనుక ఒక కథ ఉంటుంది.
కొన్ని కథలు గెలుపుతో ముగుస్తాయి.
కొన్ని త్యాగంతో.
సేవకుడు అలాంటి ఒక కథ.

తరంగిణి